## క్లుప్తంగా

### వినాయకుడు, శ్రీకృష్ణుడు విగ్రహాల ప్రతిష్ట



వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి: అప్పన్నపాలెంలో బుధవారం వినాయకుడు, శ్రీకృష్ణుడు విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ గల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వినాయకుడు, శ్రీకృష్ణుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోలాటాలు ఎంతో ఆకట్టుకున్నాయి. సర్పంచ్ రుత్తల పైడిరత్నం, ఎంపీటీసీ లాలం చినసత్యం, గ్రామ నాయకులు రుత్తల గణేష్ పాల్గొన్నారు.

### చెరువుల అభివృద్ధికి చర్యలు



నాగులాపల్లిలో చెరువును పరిశీలిస్తున్న సంపద తయారీ కేంద్రాల జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి

మునగపాక : చెరువులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని సంపదతయారీ కేంద్రాల జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి అన్నారు. చెరువులను సుందరంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మండలంలోని నాగులాపల్లిలో అభివృద్ధి చేయనున్న చెరువును ఆమె బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న చెరువు చుట్టూ అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం, అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### చూచుకొండలో కంటి వైద్య శిబిరం



కంటి వెలుగు ఆపరేషన్లకు బయలుదేరిన రోగులు

మునగపాక : వైఎస్సార్ కంటివెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చూచుకొండ సర్పంచ్ దొడ్డి సూరప్పారావు కోరారు. చూచుకొండలో విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ సహకారంతో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 100 మంది రోగులు హాజరుకాగా వారిలో 25 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు గుర్తించారు. శిబిరాన్ని ప్రారంభించిన సూరప్పారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. డాక్టర్ హరిచందన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, శంకర్ ఫౌండేషన్ మేనేజర్ అరుణకుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట : పట్టణంలో గల పలు ఏరియాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (అనకాపల్లి) కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో గల విద్యుత్ ఉపకేంద్రం పరిధి, తాండవ షుగర్ ఫ్యాక్టరీ ఫీడర్‌లో చెట్టు కొమ్మలు తొలగించడం జరుగుతుందన్నారు. అందువల్ల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంబేడ్కర్ కాలనీ, దుర్గాకాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, ధనిశెట్టి నగర్, షీలా నగర్, పండరీపురం, లింగాలకాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు.

### స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దు



రాంబిల్లిలో వామపక్ష నాయకుల ధర్నా

రాంబిల్లి : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దని సీపీఎం మండల కార్యదర్శి దేముడునాయుడు డిమాండ్ చేశారు. రాంబిల్లిలో కార్మిక సంఘాలు, సీఐటీయూ, సీపీఎం ఆధ్వ ర్యంలో బుధవారం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

# జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు

- నక్కపల్లి కాలనీలో స్ట్రీట్‌లైట్లు ప్రారంభం
- లబ్ధిదారులకు ఉచితంగా మీటర్లు



కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు



స్ట్రీట్‌లైట్లను ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ అచ్చిరాజు

నక్కపల్లి : జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ప్రతి పేద వాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉచితంగా ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. నక్కపల్లి మండలంలో 29 లేఅవుట్లు ఏర్పాటు చేసి 3 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వీరందరికీ పక్కా గృహాలు మంజూరు చేశారు. లేఅవుట్లలో కనీస సదుపాయాలను ఏర్పాటు చేశారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయంతో పాటు, విద్యుత్ సదుపాయం కూడా కల్పించారు. దీంతో లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చకచకా ప్రారంభించారు. ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ మీటరు, బోర్డు, స్తంభం నుంచి ఇంటికి అవసరమైన విద్యుత్ వైరు కూడా ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తోంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. వీధి లైట్లు కూడా ఏర్పాటు చేశారు. బుధవారం మండల కేంద్రం నక్కపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాను, స్ట్రీట్‌లైట్లను స్థానిక ఉప సర్పంచ్ వీసం అచ్చిరాజు ప్రారంభించారు. ఈ కాలనీలో 140 మందికి పట్టాలు పంపిణీ చేశారు. వీరంతా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. 30 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కాలనీలో అన్ని వీధులకు ప్రత్యేకంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు వేశారు. స్ట్రీట్ లైట్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ స్ట్రీట్‌లైట్లను బుధవారం వెలిగించారు. మండలంలో మొత్తం 29 లేఅవుట్లలో 22 లేఅవుట్లలో విద్యుత్ సదుపాయం పూర్తి స్థాయిల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, మిగిలిన లేఅవుట్లలో పనులు జరుగుతున్నాయని ఏఈ కృష్ణ తెలిపారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ సదుపాయం కల్పించి స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడం పట్ల కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సైట్ ఇంజినీరు రామకృష్ణ, మండల లైన్‌మేన్ నాగేంద్ర, స్థానిక లైన్‌మేన్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొడుగుల బంగార్రాజు, లబ్ధిదారుడు బొంతురాజు, హెల్పర్ వెంకట్ పాల్గొన్నారు.

## కడపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కడపాలెంలో స్థానికులతో ప్రభుత్వ పథకాల గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలం పూడిమడక సచివాలయం - 2 పరిధిలోని కడపాలెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఎవరికైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నవరత్నాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, స్థానిక సర్పంచ్ చేపల సుహాసిని, ఎంపీపీ కోన బుజ్జి, కో ఆప్షన్ జెడ్పీటీసీ సర్మాల కుమార్, పలువురు నేతలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## 'గడప గడపకు' విజయవంతం చేయాలి

మునగపాక : మునగపాకలో జరగనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర పూర్ణచంద్ర గణేష్ కోరారు. మంగళవారం రాత్రి పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మునగపాకలో ఈ నెల 6 నుంచి జరుగుతుందన్నారు. నాయకులు తమ పరిధిలోని వలంటీర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ నాయకులు కోనపల్లి రామ్మోహనరావు, పిల్లి అప్పారావు, బొడ్డేడ మహేష్, ఆడారి సంతోష్‌కుమార్, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కుబడి సమావేశాలు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి

కోటవురట్ల : సర్వసభ్య సమావేశం సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి అన్నారు. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. వివిధ శాఖల పని తీరు, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీ సమీక్ష చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి రావాలంటే ఎందుకనో ఎవరూ ఆసక్తి చూపించడం లేదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా నిరాసక్తంగా ఆలస్యంగా వస్తున్నారన్నారు. తరచూ ఇలా జరుగుతున్నా ఎంపీడీవో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోతోందని, డ్రైనేజీ ఏర్పాటు చేసి నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయం వెనుక గోడ కూల్చేసి చాలా కాలం అవుతున్నా ఇంకా ఎందుకు దానిని నిర్మించలేదని ప్రశ్నించారు. ఎంపీటీసీ సభ్యులు పెట్ల రాంబాబు, పుట్రేవు వెంకట సూర్యారావు మాట్లాడుతూ తరచూ పలువురు అధికారులు సమావేశాలకు గైర్హాజరవుతున్నారని, అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో లేవనెత్తిన అంశాలపై సరైన వివరణ లేదని, ప్రతి సమావేశంలో ఇదే జరుగుతోందన్నారు. సభ్యులు వివరించిన సమస్యల పరిష్కారానికి అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో మొదట వివరించాలన్నారు. గత సమస్యలు పరిష్కారం అయినపుడే ఈ సమావేశం కొనసాగించాలన్నారు. తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహిస్తే ప్రజలకు మేలు జరగదన్నారు. సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# కుండపోత వర్షం...రోడ్లు జలమయం



లింగాపురం-కొడవటిపూడి రహదారిలో వర్షపు నీటి ప్రవాహం



పూడిమడక రోడ్డులో నిలిచిన వర్షపునీరు

కోటవురట్ల : భారీ వర్షం వాహన చోదకులకు ఇక్కట్లు తెచ్చిపెడుతోంది. మండలంలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తుపాకుల గెడ్డ, తంగేడు గెడ్డలలోకి నీటి ప్రవాహం చేరింది. భారీ వర్షం కారణంగా లింగాపురం-కొడవటిపూడిలో రహదారిలో ఓ చోట వర్షపు నీరు చెరువును తలపిస్తోంది. వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు అరగంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. కొడవటిపూడి గ్రామానికి సమీపంలో పంట కాలువలకు నీరు వెళ్లేలా రోడ్డు మధ్యలో పల్లంగా వదిలేశారు. వాస్తవానికి ఇక్కడ కల్వర్టు నిర్మించాల్సి ఉన్నా రోడ్డు మధ్యలో కాలువ వదిలేయడంతోనే సమస్య ఏర్పడుతోంది. వర్షం పడితే చాలు కాలువలో నీరు చేరి చెరువులా మారిపోతోంది. భారీ వర్షానికి కాలువలో వర్షపు నీరు ఉధృతి కారణంగా వాహనదారులు ఇరువైపులా నిలిచి పోయారు. చిన్నారులు వర్షంలో అవస్థలు పడ్డారు. తరచూ ఇదే సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఎస్.రాయవరం : బంగాళాఖాతం ఏర్పడ్డ తుఫాను ప్రభావంతో బుధవారం మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది.వేసవి రోజుల్లో వచ్చిన తుఫాన్ కారణం కురుస్తున్న వర్షాలు కొబ్బరి,జీడిమామిడి తోటలకు మేలు చేసినప్పటికి స్వల్పకాలిక పంటలు నువ్వు, మినపం వంటి నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. వర్షం కారణంగా చల్లని వాతావరణం ఏర్పడడంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మునగపాక : మండల వ్యాప్తంగా బుదవారం ఉదయం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. పూడిమడక రోడ్డులో గోతుల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడ్డారు. కాగా ఈ వర్షం వ్యవసాయ పంటలకు మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

రాంబిల్లి : పలు గ్రామాల్లో బుధవారం వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. వాతావరణం బాగా చల్లబడింది. మధ్యాహ్నం వరకు ఎండ కనిపించగా ఆ తర్వాత వర్షం పడింది. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. నూర్పిడి పనులు పూర్తి చేసిన రైతులు ఆయా ధాన్యాన్ని తడిసి పోకుండా పరదాలతో కప్పివేసారు.

## సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం



అరబుపాలెంలో పర్యటిస్తున్న డీపీవో శిరీషారాణి

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి అన్నారు. మండలంలోని అరబుపాలెంలో ఆమె బుధవారం పర్యటించారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలు జరిగేలా చూడాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో రవికుమార్, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమణ, ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో రాస్తారోకో



అచ్యుతాపురం జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసిస్తూ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ ఆంధ్రుల త్యాగంతో సాధించిన స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూడడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు 811 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం చలించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు అడ్డుకునేందుకు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో చండీ, పోలవరపు అప్పారావు, ఒడిసెల శ్యాం, దమ్ము శ్రీను, ఈగల తాతారావు, వెంకట్, సాయి, రవి పాల్గొన్నారు.



విశాఖ పర్యటనకు వచ్చిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

## జాబ్‌కార్డు కలిగిన వారందరికీ పని కల్పించాలి



మండల కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు



దోసలపాడులో కూలీల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

- కూలీల సమస్యలు తెలుసుకున్న ఎంపీడీవో
- వీఆర్‌పీలు, టెక్నికల్ సిబ్బందితో సమీక్ష

నక్కపల్లి : మండలంలో జాబ్‌కార్డు కలిగిన వారందరికీ పని కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. బుధవారం ఆయన మండలంలో దోసలపాడు తదితర గ్రామాల్లో ఉపాధి పనులు పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులకు హాజరయ్యే కూలీలందరికీ జాబ్‌కార్డులు జారీ చేయాలని, వారికి పని కల్పించాలని ఆదేశించిందన్నారు. జాబ్‌కార్డు లేని వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు సాయంతో సచివాలయంలో జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారందరికీ పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. స్థానికంగానే పనులు కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన ఎంపీడీవో సమావేశ మందిరంలో వీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. నక్కపల్లి మండలంలో రోజుకు 13 వేల మంది కూలీలకు పని కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారని, కనీసం పది వేల మంది అయినా పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు అవసరమైన తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి తప్పనిసరిగా పనులు కల్పించాలన్నారు. పనులకు వచ్చిన వారికి మాత్రమే మస్టర్లు వేయాలన్నారు. పనులకు రాకుండా మస్టర్లు వేస్తే వీఆర్‌పీలపై వేటు తప్పదన్నారు. దేవవరం, ఉద్దండపురం, గొడిచర్ల, కాగిత గ్రామాల్లో చెరువుల బ్యూటిఫికేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలకు స్థల పరిశీలన



ఇళ్ల నిర్మాణాల కోసం స్థలం పరిశీలిస్తున్న గృహ నిర్మాణ అధికారులు

ఎస్.రాయవరం : ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు నచ్చిన చోటే సిద్ధం చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని గృహ నిర్మాణశాఖ డీఈ విజేయుడు అన్నారు. కొరుప్రోలు గ్రామంలో ఒక లేఅవుటు శ్మశానవాటిక దగ్గరలో సిద్ధం చేయడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఇటీవల జిల్లా కలెక్టర్ పర్యటనలో సమస్య కలెక్టర్ దృష్టికి వచ్చింది. దీంతో లబ్ధిదారులకు నచ్చిన చోటే లేఅవుటు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అదే గ్రామంలో మరో లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న స్థలాన్ని బుధవారం పరిశీలించారు. సర్పంచ్ కొరపాటి గోపాలం, మాజీ సర్పంచ్ పుట్టా సుధాకర్, గృహనిర్మాణశాఖ ఏఈ ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేశ్వరి పాల్గొన్నారు.

## 13న జాతీయ లోక్ అదాలత్

యలమంచిలి : ఈ నెల 13వ తేదిన యలమంచిలి కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించుకోవాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యలమంచిలి కోర్టులో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదా, ప్రి లిటిగేషన్, బ్యాంకు అప్పులు, టెలిఫోన్ బకాయిలు, ఇంటి పన్ను బకాయిలకు సంబంధించిన కేసుల్లో రాజీ మార్గమే రాజమార్గం అని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టుల్లో చెల్లించిన రుసుము తిరిగి తీసుకునే అవకాశం ఒక్క లోక్ అదాలత్‌లో మాత్రమే ఉంటుందని, ధన వ్యయం, సమయం కాలం వృధా చేసుకోకుండా కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు.

### బంగారమ్మ తల్లి జాతరకు ఏర్పాట్లు

ఎస్.రాయవరం : మత్స్యకారుల ఆరాధ్య దైవం అయిన శ్రీ బంగారమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో విద్యుదలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. జాతర పురస్కరించుకుని ఉత్సాహంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు.

## ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



పి.ఎస్.ఆర్ పేటలో దుర్గాదేవి విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామ ప్రజలు

యలమంచిలి : మండలంలో పి.ఎస్.ఆర్‌పేట, పేట బయ్యవరం గ్రామాల్లో శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. రెండు గ్రామాల ప్రజల ఆర్థిక సహాయంతో నూతనంగా దుర్గాదేవి ఆలయాల నిర్మాణం పూర్తి చేసుకుని ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అమ్మవారి ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. బుధవారం సాయంత్రం రెండు గ్రామాల పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, అమ్మవారి పాదాలు, కిరీటం, గరగలు మహిళలు ఊరేగించారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఆయా కార్యక్రమాల్లో గొన్నాబత్తుల శివలక్ష్మి, శివ, మొగలపల్లి వెంకట సత్యనారాయణ, గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, నారాయణరావు, జెర్రిపోతుల వెంకట్ పాల్గొన్నారు.

## పోషకాహార ప్రాధాన్యాన్ని గుర్తించండి



పోషకాహార ప్రాధాన్యతను వివరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో బుధవారం విజయవాహిని ఛారటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోషకాహారం వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యూట్రిషన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పూజ, పీజీ విద్యార్థులు పోషకాహార ప్రాధాన్యాన్ని వివరించారు. పోషకాహారం అందుబాటులో ఉన్నప్పటికీ కొందరు పట్టించుకోవడం లేదని, తద్వారా అనారోగ్యానికి కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు ఆట, పాటల ద్వారా పోషక ఆహార విలువల్ని తెలియపరిచే ప్రయత్నం చేశారు. సాయి చరణ్, హారిక, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## 7న ఉచిత కంటి పరీక్షలు

అనకాపల్లిటౌన్ : మండలంలో గోపాలపురం గ్రామంలో రామాలయం వద్ద ఈనెల 7న శంకర్ ఫౌండేషన్, రాజా ఆప్టికల్ వారి ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి 2 గంటల వరకూ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి గోవాడ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరంలో కంటికి సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని, అవసరమైన రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని తెలిపారు. కంటి శిబిరానికి వచ్చే రోగులు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని ఆయన కోరారు. కేటరాక్ట్ ఆపరేషన్ అవసరమైన రోగులు సుగర్, రక్తపోటు, ఆయాసం రోగులు గతంలో వైద్యులు రాసిన మందుల చీటీని తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు.

### రేపు వయోవృద్ధుల సమావేశం

అనకాపల్లిటౌన్ : ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈనెల 5న స్థానిక గవరపాలెం వి.వి.రమణరైతు భారతిహాల్లో సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల కృష్ణఅప్పారావు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి జిల్లాలో వృద్ధులంతా హాజరుకావాలని ఆయన బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

### త్రిపురాంతకస్వామి కల్యాణం రేపు

కశింకోట : స్థానిక శివాలయంలో ఈ నెల 5న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు వెలవలపల్లి వెంకట సూర్య శంకరం బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు స్వామి, దేవేరిలల ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరపనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 10న రాత్రి 7 గంటలకు స్వామి వారి పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com